క్లుప్తంగా

రేపు చికెన్, మటన్ దుకాణాలు బంద్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామంలోని చికెన్, మటన్ దుకాణాలను మూసివేయాలని స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ రామారావు, కారదర్శి ఎన్.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దుకాణాల యజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మాంసం, మద్యం బంద్

రేగొండ: మండలంలోని రేపు (గురువారం) గాంధీ జయంతి కావడంతో మండల వ్యాప్తంగా మాంసం విక్రయాలపై సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు ఎస్సై రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు బహిరంగంగా ఎవరైనా మాంసం విక్రయాలు చేసినా, మద్యం సేవించిన చర్యలు ఉంటాయని ఎస్సై తెలిపారు.

తల్లి ప్రేమకు నిలువెత్తు నిదర్శనం

- తల్లడిల్లుతున్న తల్లి కుక్క


కుక్కపిల్లతో కోతి

రేగొండ: కోతి కుక్క పిల్లను ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని తిరుమలగిరిలో చోటు మంగళవారం చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అప్పుడే పుట్టిన కుక్క పిల్లను వానరం చూసి తన పిల్ల అనుకుని చేతుల్లోకి తీసుకుని ఎత్తుకెళ్లింది. తన పిల్ల అనుకుని కడుపుకు హత్తుకుని ఇళ్లపై తిరిగింది. కుక్క పిల్ల కోసం తల్లి కుక్క వెనుక ఎంత తిరిగినా ఆ కోతి మాత్రం వదలలేదు. దీంతో తల్లి కుక్కను చూసిన మరికొన్ని వీధి కుక్కలు తోడయ్యాయి. అన్ని కలిసి కోతి వెంబడి వెళ్లాయి. అయినా కూడా కోతి మాత్రం కుక్క పిల్లను వదలలేదు. ఇది గమనించిన స్థానికులు ఆ కోతి చేతి నుంచి కుక్క పిల్లను విడిపించడం కోసం ఎంత ప్రయత్నం చేసినా కోతి మాత్రం వాళ్లకు దొరకలేదు. కుక్క పిల్లను కింద పడకుండా గట్టిగా పట్టుకుని చెట్లపై నుంచి గ్రామం అంతా తిరుగుతుంది. గ్రామంలో ఇళ్లపైన కుక్క పిల్లతో కోతి సంచరిస్తుంటే కింద తల్లి కుక్క తల్లడిల్లుతున్న తీరు చూపరులను అయ్యో పాపం అనిపించింది.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు..

- పలువురికి గాయాలు

భూపాలపల్లి అర్బన్: కారు అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటన మంగళవారం భూపాలపల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి మంచిర్యాలకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన దండిగ సాయి కారులో వస్తున్నాడు. ఈ క్రమంలో కమలాపూర్ క్రాస్ వద్ద ప్రధాన రహదారిపై కోతుల గుంపు రావడంతో వాటిని తప్పించపోయి కారు అదుపు తప్పి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు, కారులో ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పినట్లు ప్రయాణికులు తెలిపారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. దీంతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరామర్శ



టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట, రామకిష్టాపూర్(వి) గ్రామాలకు చెందిన బోనగిరి రాజయ్య, అల్లకొండ రాజయ్య మంగళవారం మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, మాదం కొమురయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బండ శ్రీకాంత్‌పాణి, దొంతుల శ్రీనివాస్, సంగి రవి, శాస్త్రాల కిరణ్, వెంకటేశ్వర్లు, వంగ కుమారస్వామి, ప్రభాకర్, కొల్గూరి అనిల్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా..

పరకాల: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తామని విద్యుత్ శాఖ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.మధుసూదన్‌రావు, డీఈ సామ్యా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరకాల పశువుల సంతలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న సమయంలో విద్యుత్ అంతరాయంపై ఆయన స్పందించారు. విద్యుత్ సిబ్బంది స్వీయ పర్యవేక్షణలో విద్యుత్ సరఫరాను మానిటర్ చేస్తున్న క్రమంలో సాంకేతిక లోపంతో రెండు నిమిషాలు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో వెంటనే విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై రేగొండ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించామన్నారు.

పల్లెల్లో వేడెక్కిన రాజకీయం

- ఖరారైన రిజర్వేషన్లు
- ఓటర్ల మద్దతుకు ఆశావహుల పాట్లు

రేగొండ: స్థానిక సంస్థలకు ఎన్నికల నగారా మోగడంతో పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. ఆశావహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లుగా బరిలోకి దిగేందుకు యువత సైతం ఉవ్విళ్లూరుతోంది. నాయకులను, ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావాహులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆత్మీయ పలకరింపులు, అభివృద్ధి కార్యక్రమాల హామీలు, కుల సంఘాల భేటీలతో తీరికలేకుండా గడుపుతున్నారు.

ఆశావహుల సందడి..


మండల ప్రజాపరిషత్ కార్యాలయం

రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలల్లోని గ్రామాల్లో దసరా, బతుకమ్మ పండుగలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభమైంది. ప్రధాన నాయకులు ఎన్నికల్లో పోటీ చేయడంపై చర్చలు జరుపుతున్నారు. రిజర్వేషన్లు అనుకూలించిన మాజీ ప్రజాప్రతినిధులు, ఆశావహులు గ్రామాల్లో బతుకమ్మ పండగ సందర్భంగా ఏర్పాట్లు చేశారు. రేగొండ మండల కేంద్రంలో సర్పంచ్ ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కాగా ఓ ఆశావహుడు బతుకమ్మ పండగ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంగణంలో డీజేను, విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశాడు. మరో ఆశావహుడు మంగళవారం బతుకమ్మ పండగ కోసం ఊరంతా పరిశుభ్రంగా చేసి విజయవంతానికి కృషి చేసిన గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.10 వేలు అందజేశాడు. అలాగే మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో సర్పంచ్‌కు పోటీ చేయాలనుకుంటున్న మాజీ ప్రజాప్రతినిధి బతుకమ్మ పండగ సందర్భంగా ఏర్పాట్లకు తనవంతు సాయం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల ఆశలు తారుమారయ్యాయి. గత పాలకవర్గం కాలం ముగిసిన నాటి నుంచి నిన్నటి వరకు ప్రజల మధ్య ఉంటూ ఎవరికి ఎలాంటి ఆపద వచ్చిన నేనున్నానంటూ ముందు వరసలో ఉన్నారు. శక్తికి మించి ఖర్చు చేస్తూ ప్రజలను ఆకర్షించేందుకు తహతహలాడారు. కానీ రిజర్వేషన్ల కేటాయింపుతో పరిస్థితి అంతా తలకిందులుగా మారింది. ముఖ్యంగా రేగొండ

అదృష్టం తారుమారు..

మండల కేంద్రంతో పాటు దమ్మన్నపేట, రాయపల్లి, కొడవటంచ ఎస్సీలకు, దుంపిల్లపల్లి ఎస్టీకి రిజర్వ్ కావడంతో జనరల్ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం లేకపోవడంతో నిరాశలో ఉన్నారు. అలాగే కొత్తపల్లిగోరి మండలంలో జగ్గయ్యపేట, కొనరావుపేట, చిన్నకోడేపాక, నిజాంపల్లి, దామరంచపల్లి గ్రామాలలో రిజర్వేషన్లు నిరాశపర్చడంలో ఆశావహులు ఆందోళనలో ఉన్నారు. నూతనంగా ఏర్పడ్డ కొత్తపల్లిగోరి మండలంలో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు పోటీ చేయాలనుకునే నాయకులకు రిజర్వేషన్లతో ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ఆ స్థానాలు మహిళలకు కేటాయించడంతో వారి సతులను రంగంలోకి దింపేందుకు యత్నిస్తుండగా మరికొందరు రాజకీయాలు వద్దంటూ దూరమవుతున్నారు.

నిలిచిన నిర్మాణం


పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్

- పిల్లర్ల స్థాయిలోనే కమ్యూనిటీ హాల్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్‌కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2017 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే సిరికొండ మధుసూదనచారి రూ.15లక్షల నిధులతో శంకుస్థాపన చేపట్టి పనులు ప్రారంభించారు. సింగరేణి బొగ్గు కాంటా కార్మికుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. నిధులు సరిపోవడం లేదనే కారణంతో నిర్మాణాన్ని కాంట్రాక్టర్ పునాదుల్లోనే వదిలేశారు. పనులు నిలిచిపోవడంతో 2022 సంవత్సంలో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మరో రూ.20లక్షల నిధులు కేటాయించారు. మళ్లీ పనులు ప్రారంభించిన మూడేళ్లుగా పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మాణంపై దృష్టిసారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తిచేయించాలని కార్మికులు కోరుతున్నారు.

'కాంగ్రెస్ బాకీ కార్డు' విడుదల

చిట్యాల/టేకుమట్ల: కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ రూపొందించిన బాకీ కార్డును మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి నాయకులు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రెండేళ్లుగా కాలయాపన చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బాకీ కార్డులో ఉన్న హామీలను నెరవేర్చాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని సూచించారు. చిట్యాల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, మండల ప్రధాన కార్యదర్శులు ఏరుకొండ రాజేందర్‌గౌడ్, రవీందర్‌రావు, టేకుమట్ల మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, మండల అధ్యక్షుడు సట్ల రవి, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, ఆది రఘు, బండెల నరేష్, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉద్దమారి మహేష్‌యాదవ్, శ్రీపతి శ్రీకాంత్ ఉన్నారు.


చిట్యాల: కార్డును విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర, నాయకులు

వైద్యసేవలు అందించడమే లక్ష్యం

చిట్యాల: పేద ప్రజలకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందిచడమే లక్ష్యం అని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా టీం లీడర్ యామంకీ అనిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డును డాక్టర్ క్రాంతితో కలిసి సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. దినిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య మిత్రలు గుర్రపు రాజమౌళి, స్వప్నదేవి ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా టీం లీడర్ అనిల్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు శివశంకర్

చిట్యాల: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు నోముల శివశంకర్ అన్నారు. మండలంలోని చల్లగరిగలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు నోముల శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూడపాక రాజు, సిరిపెల్లి జంపయ్య, నర్సింగరావు, కరుణాకర్, సురేందర్, శ్రావన్, నరేష్, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు


ఎస్ఎస్‌తాడ్వాయి: ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది


వెంకటాపురం(కె):నాయకుల విగ్రహాలకు ముసుగు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్‌లో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం తొలగించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఈనెల 29 నుంచి అమల్లోకి రావడంతో గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రోడ్ల వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. వాల్ రైటింగ్‌ను చేరిపేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభకాంక్షలు తెలుపుతూ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

విగ్రహాలకు ముసుగు..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగువేశారు. పార్టీల వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తటి శ్రీను, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లపై ఆరోపణలు సరికాదు

ములుగు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై తప్పుడు ఆరోపణలు సరికాదని గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల కమిషన్ జిల్లాల వారీగా సర్వేలు నిర్వహించి రిజర్వేషన్లు ఖరారు చేస్తే.. మంత్రి తనయుడి కోసం రిజర్వేషన్ అనుకూలంగా చేయించారని అనడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో నామినేటెడ్ పదవులు కష్టపడ్డవారికి ఇచ్చిన ఘనత మంత్రి సీతక్కదని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రిజర్వేషన్ రాకపోవడంతో అసహనంతో ఉన్నారంటూ తప్పుడు ప్రచారాలు చేయడం సబబుకాదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, వంగ రవియాదవ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, జిల్లా నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆశీస్సులు ఉండాలి


మొగుళ్లపల్లి: కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న మహిళలు


చిట్యాల: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీ (25వవార్డు)లోని దుర్గామాతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలంతా దినదినాభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు పలువురు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మండలంలోని చల్లగరిగ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దుర్గామాత కటాక్షం ప్రతీ ఇంటిపై ఉండి, ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని శివాలయం వద్ద కొలువుదీరిన దుర్గామాతకు నాగలగాని శ్రీనివాసరావు, నర్సింగరావు, బత్తిని రమేశ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజనమండలి సభ్యులు పంచాయతీ పాలకవర్గం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న దాతలు

చిట్యాల: మండలంలోని ఏలేటిరామయ్యపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన కొత్తూరి విజేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి రూ.లక్ష 116లను కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కనుకుల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నరేష్ కుమార్ యాదవ్, ఏలేటి సురేందర్, బాలవేణి శ్రీనివాస్, కనుకుల అర్జున్ , కాశిరెడ్డి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కన్నాయిగూడెం: వాజేడు మండలం పెద్ద గంగారం గ్రామానికి చెందిన మాజోజి నరేందర్ 5 నెలల కుమారైకు అనారోగ్య సమస్యలు ఏర్పడడంతో ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు రూ.5లక్షలు అవసరమని వైద్యులు చెప్పారు. దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన నరేందర్ దాతలు సాయం చేయాలని సామాజిక మాధ్యమాల ద్వారా కోరాడు. స్పందించిన మండలంలోని ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు రూ.22వేలు గ్రూప్ అధ్యక్షుడు అబ్బు సతీష్ ద్వారా బాధితులకు మంగళవారం అందించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు పద్ధతి మార్చుకోవాలి

- ఖాకీలకంటే సఫాయి కార్మికులే ఆదర్శం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు


కాటారం: సఫాయి కార్మికుడి కాళ్లు కడుగుతున్న పుట్ట మధు

కాటారం: మంథని నియోజకవర్గంలో పోలీసుల వ్యవహార శైలి రోజు రోజుకు శృతిమించి పోతుందని పద్ధతి మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా బెయిల్ మంజూరైంది. దీంతో మంగళవారం పుట్ట మధు మండల కేంద్రంలో జోడు శ్రీనివాస్‌ను పరామర్శించారు. అనంతరం ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సఫాయి కార్మికుడు వెంకన్నను పుట్ట మధు పూలమాలతో సత్కరించి కాళ్లు కడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాకీ యూనిఫాం వేసుకున్న కొందరు పోలీసుల కంటే ఖాకీ డ్రెస్ వేసుకొని ప్రజల శ్రేయస్సు కోసం కష్టపడే సఫాయి కార్మికులే ఆదర్శనీయం అన్నారు. అర్ధరాత్రి పూట సీఐ మద్యం మత్తులో జోడు శ్రీనివాస్‌పై దాడి చేసి అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు చెప్పినట్టు పోలీసులు నడుచుకుంటున్నారని, చట్టాన్ని పూర్తిగా తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ సంఘటనపై పూర్తి విచారణ చేపట్టి సీఐపై చర్యలు తీసుకోవాలని పుట్ట మధు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, రామిళ్ల కిరణ్, లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మార్క రాము, జక్కు శ్రావణ్, జవ్వాజి తిరుపతి, గీతా, సౌజన్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

మల్హర్: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఈ క్రీడల ద్వారా గ్రామాల్లో స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మండల కేంద్రం తాడిచర్ల గ్రామంలో రామిడి రవి జ్ఞాపకార్థం నిర్వహించిన ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి వల్లెంకుంట, రెండో బహుమతి కిషన్‌రావుపల్లి జట్లు గెలుపొందగా విజేతలకు పుట్ట మధు బహుమతులు అందజేసి మాట్లాడారు. రామిడి రవి చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధకరమని పేర్కొన్నారు. మేనమామ జ్ఞాపకార్థంగా సుంకరి సాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

రావణవధకు ఏర్పాట్లు

గోవిందరావుపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరగనున్న రావణాసుర వధ కార్యక్రమం ఏర్పాట్లు మండల పరిధిలోని పస్రా గ్రామంలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొదలయ్యాయి. ఈ సందర్భంగా దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బూర సురేందర్ మాట్లాడుతూ.. ఉత్సవాలు జరిగే స్థలంలో లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దసరా సంబురాలను ఆకర్షణీయంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మండల ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవంలో పాల్గొనాలని కోరారు. రాము, పులుగుజ్జు వెంకన్న, జీవంజి జనార్దన్, బొమ్మగాని శ్రీనివాస్, మడిపెల్లి శ్యాంబాబు, గొంది కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేనులో కొండెంగ ఫ్లెక్సీ


పత్తి చేనులో రైతు ఏర్పాటు చేసిన కొండెంగ ఫ్లెక్సీ

రేగొండ: మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన పత్తి చేను రహదారి పక్కనే ఉండటంతో నిత్యం కోతులు సంచరించి పంటను ధ్వంసం చేస్తున్నాయి. పత్తి చేను పూత, కాత దశలో ఉండటంతో కోతుల బీభత్సంతో కొమ్మలు విరిగి పూత, కాయలు రాలుతున్నాయి. దీంతో ఆలోచించిన రైతు పత్తి చేనులో కొండెంగ ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. కాగా అటువైపు వెళ్తున్న ప్రయాణికులు ఫ్లెక్సీని ఆసక్తిగా తిలకిస్తున్నారు.